# 7

# క్రీస్తు: లోక రక్షకుడు

"మరియు తండ్రి తన కుమారుని లోకరక్షరుడుగా ఉండుటకు పంపియుండుట మేము చూచి సాక్ష్యమిచ్చుచున్నాము" అని అపొస్తలుడైన యోహాను రచించాడు (1 యోహాను 4:14). యేసు క్రీస్తు అనేక పాత్రలను నెరవేర్చాడు (మరియు భవిష్యత్తులో నెరవేర్చును). ఆయన ప్రవక్త, యాజకుడు, మరియు రాజు అయియుండెను, మరియు అయియున్నాడు. అంత్య దినమున న్యాయాధిపతిగా ఆయన చేయు కార్యముల గూర్చి మనము తరువాతి పాఠములో నేర్చుకొంటాము. ఏదిఏమైనా, ఏ పాత్రయైనను, అది యోహాను మాటలాడుచున్న దాని కంటె ప్రాముఖ్యమైనది కాదు: దేవుని కుమారుడు లోక రక్షకుడై యున్నాడు.

## క్రీస్తు లోకరక్షకుడని చెప్పుటలో గల అర్థమేమైయున్నది?

ఇహమందు యేసు యొక్క బృహత్కార్యమేమైయుండినది? ఈ ప్రశ్నకు సమాధానములివ్వవలెనని చేయబడిన ప్రయత్నములు యేసు క్రీస్తునందు విశ్వసించుచున్నామని ఒప్పుకొనువారిని సహితము వేరు చేయుచు ఒక విశాలమైన అంతరమును సృష్టించుచున్నవి. మానవులు జీవించుటకు లోకము ఒక ఉత్తమమైన స్థలముగా ఉండునట్లు దానిని తీర్చిదిద్దుట ద్వారా దానిని రక్షించుటకు యేసు క్రీస్తు వచ్చాడనియు – సామాజిక న్యాయము ఆయన ప్రధాన తాపత్రయమై యుండినది, మరియు ప్రభుత్వములను ఎక్కువ న్యాయమైన వ్యవస్థగా మరియు సమాజమును ఎక్కువ నీతిమంతమైనదిగా చేయుట ఆయన ధ్యేయమై యుండినదనియు – చెప్పెడివారు ఈ అంతరమునకు ఒక ప్రక్కన ఉన్నారు.

ఈ ప్రతిపాదనలో ఎంతో కొంత సత్యము లేకపోలేదు. యేసు క్రీస్తు విధానములు అనుసరింపబడి యున్నట్లయితే, మానవులు ఉత్తమమైనవారై యుందురు. ప్రభుత్వములు ఎక్కువ నీతిమంతమైనవై యుండును; మరియు ప్రజలు వ్యక్తిగతముగా ఆనందించుచుండువారును. ఆరోగ్యవంతులును, మరియు ఒకరికొకరు ఎక్కువ తోడ్పడువారునై యుందురు.

ఏదిఏమైనా, రుజువు క్రీస్తు ప్రాథమికంగా లోకమును ఒక శ్రేష్ఠమైన స్థలముగా చేయుటకు వచ్చాడని దృక్పథమునకు వ్యతిరేకముగా మాటలాడుచున్నది. యేసు ఎన్నడును విప్లవమును ప్రబోధించలేదు, ప్రభుత్వ నాయకులు అమలు చేయవలసిన విధానములను వారికి శాసించుటకు ఆయన ఎన్నడును ప్రయత్నించలేదు, మరియు సిరిసంపదలు ప్రజల్లో ప్రతి ఒక్కరిని సమానముగా ఉండవలెనని ఎన్నడును చెప్పలేదు. ధనికులకును దరిద్రులకును నడుమ నుండు తారతమ్యములు తప్పని కూడా ఆయన సలహా ఇవ్వలేదు.

ఇంతేగాక, ఆయనను వెంబడించిన ఆది క్రైస్తవులు, తొలి శతాబ్దమునాటి సంఘము, భయంకరమైన అన్యాయము ప్రబలియుండిన ప్రపంచములో జీవించుచుండినది; అట్లయినను సంఘము రాజకీయాలతో ఎటువంటి సంబంధమైనను లేనిదై యుండినది. సంఘ సభ్యులు ఎన్నడును విప్లవమును ప్రకటించలేదు; సంఘ ప్రబోధకులు ఒక పట్టణములోనికి ప్రవేశించినప్పుడు, వారు న్యాయము గూర్చిన సామాజిక సువార్తను కాదు, కానీ యేసు క్రీస్తు

సువార్తను ప్రకటించారు.

యేసు లోకమును రక్షించుటకు అనగా లోకములో నివసించు ప్రజల ఆత్మలను రక్షించుటకు వచ్చాడని విశ్వసించెడివారు ఈ అంతరమునకు రెండవ ప్రక్క ఉన్నారు! వీరు "బైబిలు ప్రబోధాలను పాటించువారు" అని పిలువబడిన క్రైస్తవులై యున్నారు. ప్రభువు సంఘములోని సభ్యులు సర్వసాధారణంగా ఇలా వర్గీకరింపబడినప్పటికిని, ఈ సంఘమంతా విశ్వసించు లేదా బోధించు ప్రతీ విషయంతో మేము అవశ్యకముగా ఏకీభవించము. మా రాజకీయ ఎంపికలు, సామాజిక అభ్యాసములు, మరియు మతసంబంధమైన నమ్మికలు "బైబిలు ప్రబోధాలను పాటించువారు" అని పిలువబడు ఈ క్రైస్తవులు బాహాటంగా తెలియజేయు విషయాల చేత నియంత్రించబడవు. ఏదిఏమైనా, క్రైస్తవత్వము ఆత్మలు రక్షింపబడునట్లు సువార్తను – శుభ వార్తను, లేక "ఇవాంజెల్" – సువార్తమానము – (*euangelion* నుండి తీసికొనబడినది) – ప్రబోధించుటకు సంబంధించిన విషయమైయున్నదనుటతో మేము ఏకీభవిస్తాము! "బైబిలు ప్రబోధాలను పాటించువాడు" అయియుండుటలో గల అర్థము ఇదే అయినట్లయితే, వారికి కనీసము అంత హక్కైనా ఉన్నది!

## రక్షకుడైన క్రీస్తు

యేసు వచ్చిన బృహత్కార్యము ఆత్మలను రక్షించుటయై యుండినదని మనమెందుకు చెప్పుకొంటాము? ఎందుకనగా బైబిలు బోధించుచున్న విషయము ఇదే అయియున్నది.

> "ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్తయి 1:21).
>
> "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు" (లూకా 2:11).
>
> "నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను" (లూకా 19:10).
>
> దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3:16).
>
> ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి – ఇక మీదట నీవు చెప్పిన మాటనుబట్టి కాక మామట్టుకు మేము విని, యీయన నిజముగా లోకరక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి (యోహాను 4:41–42).
>
> మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడియుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను (యోహాను 20:30, 31).
>
> "ఇశ్రాయేలునకు మారుమనస్సును పాపక్షమాపణను దయచేయుటకై దేవుడాయనను అధిపతినిగాను రక్షకునిగాను తన దక్షిణహస్తబలము చేత హెచ్చించియున్నాడు" (అపొస్తలుల కార్యములు 5:31).

> "అతని సంతానమునుండి దేవుడు తన వాగ్దానము చొప్పున ఇశ్రాయేలుకొరకు రక్షకుడగు యేసును పుట్టించెను" (అపొస్తలుల కార్యములు 13:23).

> ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములోనుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేసెను. ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది (కొలొస్సయులకు 1:13, 14).

> నా నిజమైన కుమారుడగు తీతుకు శుభమని చెప్పి వ్రాయునది. తండ్రియైన దేవునినుండియు మన రక్షకుడైన క్రీస్తుయేసునుండియు కృపయు కనికరమును సమాధానమును నీకు కలుగును గాక (తీతు 1:4).

> మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధిపొందుడి (2 పేతురు 3:18ఎ).

> మరియు తండ్రి తన కుమారుని లోకరక్షకుడుగా ఉండుటకు పంపియుండుట మేము చూచి, సాక్ష్యమిచ్చుచున్నాము (1 యోహాను 4:14).

ఈ వాక్యభాగముల దృష్ట్యా, క్రీస్తు బోధలననుసరించి జీవించుట వలన ఒక శ్రేష్ఠమైన లోకము ఏర్పడుటకు అవకాశములున్నప్పటికిని, ఈ లోకమును ఉత్తమమైనదానిగా చేయుటకు క్రీస్తు రాలేదని మనము ధైర్యముతో రూఢిపర్చగలము. ఆయన లోకమును – లోకములో నివసించుచున్న మానవులను వారి పాపముల నుండి – రక్షించుటకు వచ్చాడు!

**క్రీస్తు రక్షకుడు**

యేసు క్రీస్తు ఎవరో "*ఒక రక్షకుడు*" కాడు; ఆయన మాత్రమే *రక్షకుడై* యున్నాడు. "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని ఆయన సెలవిచ్చాడు (యోహాను 14:6). యేసు గూర్చి పేతురు ఇలా చెప్పుచున్నాడు, "మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొస్తలుల కార్యములు 4:12).

ఒకడు క్రీస్తులో మరియు క్రీస్తు ద్వారా మాత్రమే రక్షింపబడగలడని చెప్పుట చాలా సంకుచితమైన మనస్తత్వమై యున్నట్లు అగుపించవచ్చును. ఏదిఏమైనా, అది సంకుచితమైన మనస్తత్వమైనా కాకున్నా, పరిశుద్ధ బైబిలు దేవుని వాక్యమని విశ్వసించువారు క్రీస్తునందు విశ్వసించకుండా క్రీస్తుకు లోబడకుండా ఈనాడు ఏ ఒక్కరును రక్షింపబడలేరు అను వాస్తవమును అంగీకరించవలెను మరియు ప్రకటించవలెను.

## క్రీస్తు లోకరక్షకుడెలా అయ్యాడు?

క్రీస్తు లోకరక్షకుడై యుండుటయే గాక, ఆయన మనలను మన పాపముల నుండి రక్షించువాడైనట్లయితే, ఆయన ఇటువంటి రక్షకుడెలా అయ్యాడు? ఈ ప్రశ్నకు సమాధానము రెండు భాగాలలో ఉన్నది.

**ఆయన ఈ లోకమునకు వచ్చాడు**

మొదటిదిగా, ఆయన ఈ లోకమునకు వచ్చాడు. దైవత్వములోని రెండవ వ్యక్తిగా, దేవుడుగా

ఆయన తన విశిష్టాధికారముల నుండి తనను తాను రిక్తునిగా చేసికొని, "మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని" ఒక మానవుడుగా జీవించుటకు ఈ లోకమునకు వచ్చాడు (ఫిలిప్పీయులకు 2:5–8). వాక్యమై యుండినవాడు – ఆదియందు దేవునియొద్ద ఉండినవాడు, వాస్తవమునకు దేవుడైయున్నవాడు (యోహాను 1:1) – "శరీరధారియై, మనమధ్య నివసించెను" (యోహాను 1:14). మానవులైన ఇతరులు "రక్తమాంసములు గలవారైనందున, ... ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడై" "అన్ని విషయములలో ఆయన తన సహోదరులవంటి వాడయ్యాడు" (హెబ్రీయులకు 2:14ఎ, 17ఎ).

**ఆయన మన పాపముల నిమిత్తము తన ప్రాణమునర్పించుటకు వచ్చెను**

రెండవదిగా, యేసు ఈ లోకమునకు వచ్చినది మనకు రక్షకుడగుటకు మాత్రమే కాదు, కానీ మన పాపములను తీసివేయుటకు మరణించుట ద్వారా ఆయన ఈ సత్సంకల్పమును సాధించాడు. ఆయన "మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీయులకు 2:8); ఆయన "మరణము యొక్క బలముగలవానిని, అనగా, అపవాదిని, మరణము ద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతయు మరణభయము చేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును, ఆయన కూడ (రక్తమాంసములలో) పాలివాడాయెను" (హెబ్రీయులకు 2:14, 15).

ఆయన తన పరిచర్యను ప్రారంభించిన తొలి రోజుల్లో, చివరకు ఆయన సిలువ మీదకు "ఎత్తబడును" అను వాస్తవమును అపేక్షించుచు మనుష్యకుమారుడు "ఎత్తబడవలెను" అని యేసు తెలియజెప్పాడు (యోహాను 3:14). తన మరణము గూర్చి ముందుగానే తెలియజెప్పుటకు (మత్తయి 16:21), ఆయన "అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకు" వచ్చెనని చెప్పెను (మార్కు 10:45).

ఆసన్నమగుచుండిన ఆయన మరణము గూర్చి ఆయన కలవరముచెందినప్పుడు, "నే నేమందును ... ?" అని తనను తాను ప్రశ్నించుకొన్నాడు. ఆయన ఒక సాధ్యత గూర్చి ఆలోచించాడు: "తండ్రీ, ఈ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము?" అటుతరువాత, తనలో తాను, నిజానికి, "లేదు, నేను అలా చెప్పజాలను ఎందుకనగా నేనిక్కడ ఉండుటకు గల హేతువు ఇదే" అని చెప్పుకొన్నాడు (యోహాను 12:27). అనగా, తన మరణగడియలను అనుభవించుటకు ఆయన ఈ లోకమునకు వచ్చాడని యేసు చెప్పెనని మరో మాటలో చెప్పుకొనవచ్చును. ఆయన జీవిత సంకల్పము అదే అయియుండెను.

ఆయన ఈ ఉద్దేశమును నెరవేర్చాడు. ఆయన సిలువపై మరణించాడు, మన పాపముల దోషమును తనపైనే వహించి భయంకరమైన సిలువ మరణము ద్వారా మనకు రక్షకుడయ్యాడు. యేసు "మన మహా దేవుడును రక్షకుడును అయియున్నాడు" అని చెప్పుచూ యేసు "మనలను విమోచించుటకు తనను తాను అర్పించుకొన్నాడు" అని పౌలు పలుకుచున్నాడు (తీతు 2:13బి, 14ఎ). యేసు జీవితము మరియు ఉపదేశములు ప్రాముఖ్యమైనవై యుండెను, కానీ ఆయన సిలువ మీద మరణించినట్లయితే నశించిన మానవాళిని రక్షింపవలెనను తన బృహత్కార్యమును ఆయన నెరవేర్చియుండెడివాడు కాదు!

## క్రీస్తు రక్షకుడై యుండుట మనకేమని అర్థమిచ్చుచున్నది?

*మొదటిదిగా, యేసు రక్షకుడై యున్నాడను వాస్తవము రక్షణ సాధ్యమే యను అర్థమునిచ్చుచున్నది!* యేసు "ప్రతి మనుష్యుని కొరకు మరణమును రుచి చూసాడు" (హెబ్రీయులకు 2:9); కాబట్టి, ఆయన తన మరణము ద్వారా అందరికిని అందుబాటులో ఉండునట్లు ఏర్పాటుచేసిన రక్షణను అంగీకరించుటకు ప్రతి ఒక్కరును స్వతంత్రులై యున్నారు! యేసు ఈ లోకమునకు వచ్చి మరణించాడు గనుక, "సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమైనది" (తీతుకు 2:11).

ఒక వ్యక్తి విషయంలో రక్షణ సాధ్యత వాస్తవము కాకమునుపు, అతడు సువార్తకు లోబడవలెను! అలాగైతే ఒకడు సువార్తకు లోబడవలెనంటే ఏమి చేయవలెను?

1. యేసునందు విశ్వసించవలెను (యోహాను 3:16; 5:24; మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 16:31).
2. తన పాపముల గూర్చి పశ్చాత్తాపపడవలెను (లూకా 13:3, 5; అపొస్తలుల కార్యములు 17:30, 31).
3. యేసు, దేవుని కుమారుడైన క్రీస్తు అని విశ్వససించి దానిని ఒప్పుకొనవలెను (రోమా 10:9, 10; మత్తయి 10:32, 33).
4. పాపక్షమాపణ నిమిత్తమైన బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38; 22:16).

*రెండవదిగా, యేసు రక్షకుడై యున్నాడను వాస్తవము రక్షింపబడినవారు ఇతరులకు క్రీస్తు సువార్తను ప్రకటించుటకు ప్రయత్నించవలసిన బాధ్యత కలిగియున్నారని అర్థమునిచ్చుచున్నది.* క్రీస్తుకు వేరుగా ఇతరమైన ఏ విధముగానైనను మానవులు రక్షింపబడుటకు వీలు లేదు గనుక వారు సువార్త ప్రకటింపబడకుండా రక్షింపబడ జాలరు (రోమీయులకు 10:13–17; 1 కొరింథీయులకు 1:18–25; రోమీయులకు 1:16).

క్రైస్తవులపై ఒక బ్రహ్మాండమైన బాధ్యత ఉన్నది! లోకము పాపముచేత అంధకారమయమై యున్నది. ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులు క్రీస్తు నందు విశ్వసించరు కాబట్టి వారు ఆయన అనుగ్రహించు రక్షణ యను ఉచిత వరమును అంగీకరించలేరు. యేసు క్రీస్తే వారి ఏకైక నిరీక్షణయై యున్నాడు గనుక వారు క్రీస్తు సువార్త వినవలెనంటే క్రైస్తవులు వారికి ఆయన గూర్చి తెలియజెప్పుట మాత్రమే, "క్రీస్తును, సిలువవేయబడిన క్రీస్తును" వారికి ప్రకటించుటయే ఒక మార్గమై యున్నది. మనము మహా ఆదేశము సంబంధమైన మన బాధ్యతను నిర్వర్తించుటలో విఫలులమైనట్లయితే, రక్షింపబడనివారు రక్షింపబడనివారుగానే మిగిలిపోవుదురు.

## ముగింపు

చివరలో రెండు ముఖ్యమైన ప్రశ్నలు వేసికొనవలెను. మొదటిది, లోకరక్షకుడైన వాని చేత నీవు రక్షింపబడితివా? లేనట్లయితే, ఆయన నీకిచ్చుచున్న పిలుపునకు విధేయతతో వీలైనంత త్వరలో ప్రతిస్పందించుము! ఎంతైనా, నీవు యింకా బ్రతికి యుండుటకు నీకెంత సమయము మిగిలియున్నదో నీకు తెలియదు. రెండవదిగా, నీవు రక్షింపబడినట్లయితే, ఇతరులు రక్షింపబడునట్లు నీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నావా? యేసు లోకరక్షకుడై యున్నాడు! ఇదొక

గొప్ప శుభ వార్తయై యున్నది! గనుక ఈ సువర్తమానమును మన పొరుగువారితో – మనకు ప్రక్కనే ఉన్న పొరుగువారు మరియు లోకమందంతటను ఉన్నవారితోను – పంచుకొనుటకు మనము మన శాయశక్తులా ప్రయాసపడుదుము!

---

## క్రీస్తు మరియు బాప్తిస్మము

యేసు క్రీస్తు మన రక్షకుడు గనుక, బాప్తిస్మమునకును గల సంబంధమేమిటో పరిశీలనగా పరీక్షించి తెలిసికొనుట ద్వారా మనము బాప్తిస్మము ఆవశ్యకత గూర్చిన ప్రశ్నకు సమాధానం ఇవ్వగలము.

- యేసు బాప్తిస్మము పొందినవాడు (మత్తయి 3:13–17), గనుక మనము ఆయన చూపిన మాదిరిని అనుసరించవలెను.
- బాప్తిస్మము పొందవలెనని యేసు ఆజ్ఞాపించాడు (మత్తయి 28:19; అపొస్తలుల కార్యములు 10:48), గనుక మనము ఆయనకు లోబడవలెను.
- రక్షింపబడుటకు, మనము "క్రీస్తు నందు" ఉండవలెను (ఎఫెసీయులకు 1:3), గనుక మనము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుదుము (గలతీయులకు 3:26, 27; రోమీయులకు 6:3).
- రక్షింపబడుటకు, మనము క్రీస్తు రక్తములో, యేసు సిలువ మీద తన మరణము ద్వారా చిందించిన రక్తములో కడుగబడవలెను; అప్పుడు మనము ఆయన మరణము లోనికి బాప్తిస్మము పొందినవారమగుదుము (రోమీయులకు 6:3, 4).
- మనము బాప్తిస్మము పొందినప్పుడు, ఒక నూతన జన్మను మరియు నూతన జీవమును అనుభవించుటకు మనము క్రీస్తుతో కూడా పాతిపెట్టబడి మరలా ఆయనతో కూడా లేపబడుదుము (యోహాను 3:3, 5; రోమీయులకు 6:3–6; కొలొస్సయులకు 2:12).
- రక్షింపబడుటకు, మనము క్రీస్తు ప్రేమించు, క్రీస్తు మరణించిన, మరియు క్రీస్తు రక్షించు సంఘములో చేరినవారమై యుండవలెను (ఎఫెసీయులకు 5:23–25). మనము ఆ సంఘము లోనికి, క్రీస్తు శిరస్సైయున్న సంఘము లోనికి, బాప్తిస్మము పొందినవారమగుదుము (1 కొరింథీయులకు 12:13; మత్తయి 16:18బి; కొలొస్సయులకు 1:18 చూడుము).